క్లుప్తంగా

ధ్యానంతో ఆరోగ్యం


ధ్యానం చేస్తున్న భక్తులు

నడిగూడెం : నిత్యం ధ్యానం చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రముఖ యోగ గురువు చుక్కా మధు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లాపురంలో గల శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఏకాదశి, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఇస్తున్న ధ్యాన శిక్షణను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సభ్యుడిగా మహేష్‌గౌడ్



గరిడేపల్లి : లోక్ అదాలత్ సభ్యుడిగా మండలంలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన చెనగాని మహేష్‌గౌడ్‌ను నియమిస్తూ మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహేష్‌గౌడ్ ఎంపికపై కీతవారిగూడెం గ్రామస్తులు అతనికి అభినందనలు తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

గరిడేపల్లి : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్ అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన రూ. 19 వేల కోట్లు ఏ మూలకు సరిపోవన్నారు.

టెట్ నిర్వహించాలి


నేరేడుచర్ల : రాష్ట్రంలో ఉపాధ్యాయ నోటిఫికేషన్ (టీఆర్‌టీ) వేయకముందే టెట్ పరీక్షను నిర్వహించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఉట్కూరి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏనిమిదేళ్లు పూర్తవుతున్నా నేటికీ ఒక్క ఉపాధ్యాయ నోటిఫికేషన్ కూడా నిర్వహించకపోవడం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఆయనవెంట పెంచికల్‌దిన్న కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగరాజు తదితరులున్నారు.

సీపీఐలో పలువురి చేరిక


సీపీఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లిలో వివిధ పార్టీలకు చెందిన పలువురు సోమవారం సీపీఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సీపీఐ చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో పంటలు ఎండి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సింహాద్రి, పట్టణ అధ్యక్షుడు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, నాగరాజు, వెంకన్న తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు జెడ్పీటీసీ పరామర్శ


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ కవిత, తదితరులు

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంనకు చెందిన అబ్దుల్ ఘనీ(35), పఠాన్ షరీఫ్(38) ఆదివారం మునగాల మండలం ముకుందాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు బానాల కవిత వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెవెంట మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, సర్పంచ్ మంచికంటి వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నీలకంఠ వెంకటేశ్వర్లు, ఖలీల్ అహ్మద్, షేక్.ససీమా, తదితరులున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ నెల 11న సీపీఐ(ఎంఎల్) క్రాంతి, సీపీఐ(ఎంఎల్)రామచంద్రన్ పార్టీల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సు కరపత్రాలను అర్వపల్లిలో సోమవారం సీపీఐ(ఎంఎల్)రామచంద్రన్ అధికార ప్రతినిధి బుద్దా సత్యనారాయణ ఆవిష్కరించారు.

విషం చిమ్ముతున్న 'డాంబర్ ప్లాంట్'

- నారాయణపురంలో డాంబర్ ప్లాంట్ నుంచి వదులుతున్న పొగ
- నల్లబారుతున్న వరి పొలాలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు గురుకుల, ఇంజనీరింగ్ విద్యార్థులు
- శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన


నారాయణపురంలోని గుట్టల్లో గల డాంబర్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న నల్లటి పొగ

చిలుకూరు : మండల పరిధిలోని నారాయణపురం గుట్టల్లో ఏర్పాటు చేసిన డాంబర్ ప్లాంట్‌లో వారం రోజులుగా మళ్లీ డాంబర్ తయారీ మొదలైంది. దీంతో ఆ ప్లాంట్ నుంచి వస్తున్న నల్లటి పొగతో చుట్టు పక్కల గల పచ్చని పొలాలు నల్లబారుతున్నాయి. పొగతో నారాయణపురం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే డాంబర్ ప్లాంట్ చాలా రోజులుగా మూతపడి ఉంది. ఇటీవల తిరిగి మళ్లీ ప్లాంట్‌ను ప్రారంభించారు. కాగా నిబంధనల ప్రకారం డాంబర్ ప్లాంట్ నుంచి పొగ పెద్దఎత్తున రాకుండా ఉండేందుకు సంబంధిత మిషన్ ఏర్పాటు చేయాలి. దాంతో పొగకు వాటర్ మిక్సింగ్ కావడం వల్ల పెద్దఎత్తున పొగ రాకుండా ఉంటుంది. కానీ అలాంటి మిషన్స్ ఏర్పాటు చేయకపోవడంతో నల్లటి పొగ ప్లాంట్ చుట్టుపక్కల వ్యాపించి ప్రజలకు సమస్యలను తెచ్చిపెడుతోంది. అయితే గతంలో డాంబర్ ఫ్యాక్టరీ నుంచి విపరీతమైన పొగ వస్తుండడంతో సమీపాన గల మిట్స్, అక్షరా కళాశాల యాజమాన్యాలు విద్యార్థులతో కలిసి ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేయడంతో ఆ సమయంలో పొగ రాకుండా మిషన్ ఏర్పాటు చేశారు. అప్పుడు పొగ నుంచి ప్రజలకు, విద్యార్థులకు ఉపశమనం లభించింది. కానీ ప్రస్తుతం ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా పొగను విడుదల చేస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు..

అయితే డాంబర్ ప్లాంట్‌కు దగ్గరలో బీసీ, ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అలాగే ఒక ఇంజనీరింగ్ కళాశాల ఉంది. సుమారుగా 1000 మందికి పైగా విద్యార్థులు గురుకుల పాఠశాలలు, కళాశాలలో చదువుతున్నారు. కాగా డాంబర్ ప్లాంట్ నుంచి వస్తున్న పొగతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. వరి పొలాలు కూడా తింటున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు, విద్యార్థులకు హాని కలిగించే డాంబర్ ప్లాంట్‌ను మూసివేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్లాంట్ మూసివేయించాలి



డాంబర్ ప్లాంట్ నుంచి వచ్చే పొగ మా గ్రామంలోకి వస్తుంది. దీంతో గ్రామస్తులతో పాటు డాంబర్ ప్లాంట్‌కు దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఫ్యాక్టరీ చుట్టు పక్కల గల రైతుల పంట పొలాలు దెబ్బతింటున్నాయి. కావున తక్షణమే అధికారులు స్పందించి ప్రజలకు హాని కలిగించే డాంబర్ ప్లాంట్‌ను మూసివేయించాలి.

– దేశబోయిన జానకిరాములు, నారాయణపురం

మార్మోగిన 'ఓ లింగా' నామస్మరణ


లింగమంతులస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


డ్యాన్స్ ప్రోగ్రాంను ప్రారంభించి, మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెంలో యాదవగట్టుపై (చిన్నగట్టు) కొలువుదీరిన లింగమంతులస్వామి జాతరను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గట్టు పరిసర ప్రాంతాలు ఓ లింగా నామస్మరణతో మారుమ్రోగాయి. ఆదివారం రాత్రి యాదవ పెద్దలు, గ్రామస్తులు ప్రభలు, గంపల ఊరేగింపుతో జాతరను ప్రారంభించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా గట్టుపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యరమాల సుశీల బెంజిమెన్, ఎంపీటీసీ యరమాల క్రాంతికుమార్, ఆలయ కమిటీ చైర్మన్ గుండె బోయిన చిన్న లింగయ్యాయాదవ్, అల్సకాని శరభేశ్వరరావు, ప్రగఢ వెంకటేశ్వరరావు, మేకల ప్రతాప్, ముండ్రా రంగారావు, గోపి, యాదవ పెద్దలు ఉన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

చిన్నగట్టు లింగమంతుల జాతరకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన డ్యాన్స్ ప్రోగ్రాంలను ప్రారంభించి మాట్లాడారు. వారివెంట ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, ఆయా పార్టీల నాయకులు, తదితరులు ఉన్నారు.

బడ్జెట్ కేటాయింపుపై హర్షం

మునగాల : రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,90,396 కోట్లు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా ఉండడం, రైతు రుణమాఫీ, గ్రామ పంచాయతీలు, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యా రంగానికి, రోడ్లు, భవనాల శాఖలకు, పరిశ్రమలకు, రైతు బంధు, రైతు బీమా, నీటి పారుదల, విద్యుత్ రంగం, గిరిజన సంక్షేమం, దళిత బంధు, బీసీ, మైనార్టీ సంక్షేమం లాంటి అన్ని వర్గాల ప్రజలకు బాహుబలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన సంక్షేమ పథకాలన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని సత్యనారాయణ ఆకాంక్షించారు.

కొత్త వంగడాలతో అధిక లాభాలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త లవకుమార్

మోతె : కొత్త వంగడాల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రావిపహాడ్ క్లస్టర్ రైతు వేదికలో శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా రైతులకు మినప విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా మినుప పంటపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జీవ ఎరువులు, సేంద్రీయ ఎరువుల వాడకంతో ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి సాధించవచ్చన్నారు. పెసర, మినుము పంటల్లో చీడపీడలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.కిరణ్, నరేష్, ఆదర్శ్, మండల విస్తరణ అధికారి కార్తిక్, రైతులు మల్లారావు, మధుసుదన్‌రెడ్డి, కేతిరెడ్డి శ్రీను, పెరుగు లింగయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


కల్లూరులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

నేరేడుచర్ల : కంటి వెలుగు పథకం పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. సోమవారం మండలంలోని కల్లూరు గ్రామంలో ఆయన కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి వెలుగు జిల్లా అధికారి సాహితితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసిమళ్ల సరిత, ఎంపీడీఓ విజయకుమారి, పెంచికల్‌దిన్న వైద్యాధికారిని సీతామహాలక్ష్మి, సర్పంచ్ పల్లెపంగ నాగరాజు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, ఎంపీటీసీ నాగవేణి, నాయకులు శ్రీనివాస్, నారాయణరెడ్డి, మాధవరావు, నాగరాజు, కార్యదర్శి పద్మ ఉన్నారు.

జీపీ సిబ్బంది పాదయాత్రను జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మునగాల : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని గ్రామపంచాయతీ వర్కర్స్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సొంపంగు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సిబ్బందితో కలిసి పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాటి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్‌లు తెచ్చిందని, ఈ కోడ్‌ల వల్ల గ్రామపంచాయతీ సిబ్బందికి కార్మికచట్టాలు వర్తింపచేయకుండా కుట్ర పన్నుతుందని ఆరోపించారు. జీపీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గుర్వమ్మ, సిబ్బంది రేణుక, ఎల్.భిక్షం, ఎల్.నాగార్జున, దుర్గారావు, తిరుపమ్మ, మేరుగ తిరపయ్య పాల్గొన్నారు.

గోవుల వ్యాక్సిన్లకు రూ.50 వేలు అందజేత


పశువైద్యాధికారికి నగదు అందజేస్తున్న రవి

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని గోవులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ వ్యాక్సిన్లు (టీకాలు) ఉచితంగా వేసేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన భర్త రవి ద్వారా రూ.50 వేలు సోమవారం మండల పశు వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ చైర్మన్ జక్కుల వెంకయ్య, కౌన్సిలర్ ఎ.సతీష్, భాస్కర్, కె.శ్రీను, శంకర్‌రెడ్డి పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవళింపు సేవ


పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు, గ్రామ పెద్దలు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్ల పవళింపు సేవను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో శ్రీస్వామి వారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మణరావు, సర్పంచ్ కృష్ణవేణినరేష్, అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, సాయికుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వికలాంగులకు మొండిచేయి

- జీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్


సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

మునగాల : రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మొండిచేయి చూపిందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో దుర్భర జీవితం గడుపుతున్న 30 లక్షల మంది వికలాంగుల సంక్షేమానికి రూ.పదివేల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా, ఆర్థిక మంత్రి హరీష్‌రావు కేటాయించకుండా వికలాంగుల సమాజాన్ని విస్మరించారని అన్నారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహకం, స్వయం ఉపాధి రుణాల కోసం ఎదురుచూస్తున్న వికలాంగులకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదో మంత్రి హరీష్‌రావు స్పష్టం చేయాలని రాజేష్ డిమాండ్ చేశారు. దళితబంధు తరహాలో ప్రతి వికలాంగుడికి రూ.15లక్షలతో వికలాంగుల బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని పోరాటం చేస్తున్న వికలాంగుల సమాజానికి మంత్రి సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్, రూ.పదివేల కోట్లతో వికలాంగుల బంధు పథకానికి నిధులు కేటాయించాలని లేనియెడల మంత్రి హరీష్‌రావు సొంత నియోజకవర్గమైన సిద్దిపేట నుంచి వికలాంగుల సమాజం సింహగర్జనకు సిద్ధమవుతుందని అన్నారు. సమావేశంలో బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు దొడ్డ ఆదినారాయణ, తమ్మనబోయిన చిన వీరయ్య, పరుశరాం, హనుమ పాల్గొన్నారు.

ఎర్రవరం ఎంపీటీసీ రాజు మృతి


గుగులోతు రాజు (ఫైల్)

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరం గ్రామ ఎంపీటీసీ, బీక్యా తండా గ్రామానికి చెందిన గుగులోతు రాజు (74) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు పక్షవాతం రావడంతో వైద్యులు కాలును తొలగించారు. దీంతో మంచానికే పరిమితమైన ఆయన సోమవారం రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల సర్పంచ్ బాణోతు అంబేద్కర్, మాజీ సర్పంచ్ రాములు, అన్నెం పెద్ద అంజిరెడ్డి, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో లింగమయ్యకు పూజలు

- బోడిగుట్టపై రెండోరోజు వైభవంగా లింగమంతులస్వామి జాతర
- ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించిన మంత్రి తలసాని


లింగమంతులస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కోదాడఅర్బన్ : పట్టణంలో జీర్ణోద్ధరణ చేసిన లింగమంతులస్వామి జాతర రెండోరోజు సోమవారం వైభవంగా సాగింది. ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు స్వామివారికి భక్తులు మేకపోతులను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం లింగమంతులస్వామి ఆలయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలోని లింగమంతులస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనను సత్కరించారు.

ఆలయ పరిసరాల పరిశీలన..

పూజల అనంతరం లింగమంతులస్వామి ఆలయ పరిసరాలను మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఎమ్మెల్యే బొల్లంతో కలిసి పరిశీలించారు. ఆలయానికి వెనుక భాగంలో పెద్ద చెరువు, కట్ట, ముందు భాగంలో అనంతగిరి రోడ్డు, పచ్చని పంటపొలాలు ఆహ్లాదకరంగా ఉన్నందున ఆ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పాన్ని ఎమ్మెల్యే బొల్లంమల్లయ్యయాదవ్.. మంత్రి తలసాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆలయ పరిసరాలను పూర్తిగా పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కౌన్సిలర్ కల్లూరి పద్మజ, ఆలయ కమిటీ సభ్యులు ఈదుల కృష్ణయ్య, పుర ప్రముఖులు, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం


స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గట్టుపై స్వయంవ్యక్త శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం తెల్లవారుజామున పూజారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రస్వామి, సీతమ్మ వార్లను పట్టు వస్త్రాలు, పూలమాలలతో అందంగా అలంకరించి గట్టు కింద ఉన్న కల్యాణ మండపానికి మేళతాళాలతో తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, రజిత దంపతులు పీటలపై కూర్చొని స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, కంకణధారణ చేశారు. గూడ జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ అనంతరం తలంబ్రాలు తదితర ఘట్టాలను పూజారుల వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు కోటా సూర్యప్రకాష్‌రావు, గుండా రమేష్, అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, పి.అశోక్, తిరుపారెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటనారాయణ, గుండా ఫణికుమారి, దొంతిరెడ్డి పద్మావతి, వెన్న పద్మ, అర్చకులు, స్థానాచార్యులు, దేవాలయ అభివృద్ధి సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

కల్యాణోత్సవాలను పురస్కరించుకుని గుట్ట వద్ద విద్యుత్ దీపాల ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

చిన్నగట్టు జాతరకు తరలొచ్చిన భక్తజనం


లింగమంతుల స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

- పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సైదిరెడ్డి దంపతులు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి దంపతులు, తదితరులు


కోలాట ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని అమరవరం గ్రామ శివారులో ఉన్న చిన్నగట్టుపై లింగమంతులస్వామి జాతరకు సోమవారం భక్తజనం తరలొచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన కోలాట ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలపై లింగమంతులస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. లింగమంతులస్వామి ఆశీస్సులతో సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరబోయిన మట్టయ్యయాదవ్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ సుజాత, మండల టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడెం గోపిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యాదవ కులస్తులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

15న సేవాలాల్ జయంతి నిర్వహించాలి


సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతిని ప్రభుత్వం ఫిబ్రవరి 15న నిర్వహించాలని నియోజకవర్గ గిరిజన నాయకులు కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన గిరిజన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫిబ్రవరి 15న ప్రతి గిరిజన గ్రామంలో సేవాలాల్ జయంతిని ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. ఈ విషయమై చర్చించేందుకు ఈనెల 13న గిరిజన ముఖ్య నాయకుల సమావేశాన్ని స్థానిక బంజారా భవన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిరిజన ముఖ్యనాయకులు, మేధావులు పాల్గొని సలహాలు, సూచనలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు బి.జగన్‌నాయక్, ఎం.కొండానాయక్, నగేష్ రాథోడ్, బి.వెంకటేశ్వర్లు, నవీన్‌నాయక్, నాగు, బాబు, నాగు, రంగా తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రను జయప్రదం చేయాలి



మఠంపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి చేపట్టనున్న హాత్ సే హాత్ జోడో యాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రచార యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సైదులు, కరీం, గోవింద్, చీనా, మహేష్, దుర్గయ్య, పుల్లారెడ్డి, సక్రియా తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రపై ఇంటింటి ప్రచారం

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో సోమవారం హాత్ సే హాత్ జోడో యాత్రకు సంఘీభావంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి హస్తం గుర్తు స్టిక్కర్లను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు చాంద్‌మియా, నాయకులు కీత సోమయ్య, బాదే నర్సయ్య, నాగయ్య, మధార్, రామ్మూర్తి, సైదులు, కృష్ణమూర్తి, రాంబాబు, లింగయ్య, వెంకన్న, అప్పారావు, శ్రీను, మట్టయ్య, అబ్రహం తదితరులున్నారు.